సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

నల్లకుంట డివిజన్‌కు చెందిన అజయ్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.2.50లక్షల ఎల్ఓసీని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం అందజేశారు. నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బీజేపీ నాయకులు ఎక్కాల నందు, నియోజకవర్గం కన్వీనర్ శ్యాంరాజు తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూలై 13

నేడు శాకంబరిగా మహంకాళి అమ్మవారు

అంబర్‌పేట, జూలై 13 : ఆషాఢ బోనాలలో భాగంగా అంబర్‌పేట శ్రీమహంకాళి అమ్మవారిని నేడు ఆదివారం శాకంబరిదేవిగా అలంకరిస్తున్నట్లు దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. సాయంకాలం అమ్మవారి ఘటం ఊరేగింపు మహంకాళి దేవాలయం నుంచి ఉన్న బొడ్రాయి వద్దకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాచిగూడ ఎస్సీ హాస్టల్‌ను తెరవాలి

కాచిగూడ, జూలై 13: కాచిగూడ నింబోలిఅడ్డాలోని ఎస్సీ హాస్టల్‌ను రిపేర్ల పేరుతో 5 సంవత్సరాలుగా మూసివేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కాచిగూడ హాస్టల్ రీఓపెన్ పోరాట సమితి అధ్యక్షుడు, హాస్టల్ పూర్వ విద్యార్థి డాక్టర్ రుద్రవరం లింగస్వామి అన్నారు. శనివారం హాస్టల్‌ను సందర్శించి, మాట్లాడుతూ.. రిపేర్ల పేరుతో విద్యార్థులను ప్రైవేట్ టు బిల్డింగ్‌కు తరలించొద్దని, అక్కడ సరియైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాచిగూడ హాస్టల్‌ను తెరవాలని డిమాండ్ చేశారు.

పూడిక తీయకపోవడంతోనే వరదనీటి సమస్య

పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ పావని తదితరులు

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూలై 13 : హైదరాబాద్ నగరంలో ప్రతి సంవత్సరం వర్షాకాలం ముందు కచ్చామోరీల్లో పేరుకు పోయిన పూడిక తీయాలి. కానీ ఈ సంవత్సరం తీయక పోవడంతో వరద సమస్య తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ప్రధాన రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో నాలా పైప్‌లైన్ పనులను శనివారం కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ పావనితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే కచ్చా నాలాల్లో పూడిక తీసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. నూతన పైప్ లైన్ ద్వారా వరదనీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యమంలో డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, బీజేపీ నాయకుడు వినయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, ముచ్చకుర్తి ప్రభాకర్, రవిశంకర్ గుప్తా, బీజేపీ నాయకులు పూస రాజు, రమేశ్ రామ్, ఉమేశ్, వీఎస్‌టీ రాజు, సత్యం, కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(సాట్స్) చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.శివసేవారెడ్డిని తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య ఘనంగా సన్మానించారు. గచ్చిబౌళిలోని సాట్స్ అథ్లెటిక్స్ స్టేడియంలో శనివారం నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో భారీ సంఖ్యలో పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడ అభిమానులు ఆయనను సన్మానించారు.

– అంబర్‌పేట, జూలై 13

జిమ్ ప్రారంభం..

జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి,జూలై 13 : కవాడిగూడ డివిజన్ దోమలగూడ పార్క్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన నూ ఓపెన్ జిమ్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ రచన శ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యమంలో డీఈ సన్నా, ఏఎంఓహెచ్ మైత్రేయి దోమలగూడ వటర్‌వర్క్ మేనేజర్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహా, బీజేపీ నాయకులు వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు వల్లాల శ్యామ్, శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి శనివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు మిర్యాల శ్రీను, తొలుపునూరి కిరణ్‌గౌడ్ ఉన్నారు.

– అంబర్‌పేట, జూలై 13

భారతీయ కళలను భావితరాలకు అందించాలి

ప్రతిభావంతులకు పురస్కారాలను అందజేసిన సముద్రాల వేణుగోపాలాచారి

తెలుగు యూనివర్సిటీ, జూలై 13 : భారతీయ కళలను, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుని భావితరాలకు అందించేలా కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి సూచించారు. ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన భారతీయ లలిత కళా ఉత్సవ్ ఆధ్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేణుగోపాలాచారి విచ్చేసి ఆధునిక సమాజానికి కళలు ఎంతో అవసరమని అన్నారు. సాహితీవేత్త డాక్టర్ సీహెచ్ బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. లలిత కళలు మన జీవనాడి అని పేర్కొన్నారు. నిర్వాహకులు డాక్టర్ అద్దంకి రాజా, సాహితీవేత్తలు రొయ్యూరు అశ్రిత, ధారావత్ బాలసన్‌నాయక్, సినీ ప్రొడ్యూసర్ మాగంటి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల ప్రతిభావంతులకు జాతీయ స్థాయిలో కళారత్న, విద్యా రత్న, వైద్య రత్న, సేవా రత్న, సంఘమిత్ర, పర్యావరణ మిత్ర, రైతు మిత్ర పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు.

కార్యకర్తల కృషితో తెలంగాణలో విజయం

కాచిగూడ, జూలై 13: కార్యకర్తల కృషితోనే తెలంగాణలో 8 అసెంబ్లీ, పార్లమెంటరీ సీట్లు సాధించినట్లు కేంద్ర బోగ్గ గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాచిగూడకు వచ్చిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని బర్కత్‌పుర నివాసంలో కార్పొరేటర్ ఉమాయాదవ్ ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సారంగపాణి, నందకిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఢిల్లీ బోనాలలో.. నగర విద్యార్థినులు

న్యూ ఢిల్లీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర విద్యార్థినులు

బోనమెత్తిన సాయి శరణ్య

కార్వాన్, జూలై13 : ఆషాఢ మాసం ప్రారంభమైన నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగరానికి చెందిన విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థినులు బోనం ఎత్తుకోవడంతో పాటు నాట్య ప్రదర్శనతో ఉత్సవాలకు ఆకర్షణగా నిలిచారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి : ఏసీపీ

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్, జూలై 5 : ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు తెలిపారు. గోషామహల్ పోలీస్ ట్రైనీ విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం , అదే విధంగా ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతాయని, సిగ్నల్ పడగానే స్టాప్‌లైన్ వద్ద వాహనాలు నిలపడం, ట్రిబుల్ రైడింగ్, పాదచారులు జీబ్రా క్రాసింగ్ వద్ద వెళ్తున్నప్పుడు వాహనాలను నిలపాలని సూచించారు. పోలీస్ ట్రైనీ విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఎం. ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్‌దేవ్, నరసింహమూర్తి, ఆర్ఐ ఆర్ఎస్ఐ కుమార్, అశోక్ కుమార్, సీటీసీ గోషామహల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ బోనాలకు విశేష ఆదరణ

ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ బోనాలకు విశేష ఆదరణ ఉందని, ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తితో నిర్వహిస్తారని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని దేవాలయాల నిర్వాహకులకు బోనాల చెక్కులను కార్పొరేటర్ పంపిణీ చేశారు. కన్నె రమేశ్‌యాదవ్, మల్లికార్జున్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జూలై 13

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించండి

శాంతినగర్‌లో తాగు నీరు కలుషితమై వస్తున్నదని స్థానికులు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దృష్టికి తెచ్చారు. ఆమె సూచనతో పార్టీ నాయకుడు బి.వెంకటరెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాటర్‌వర్క్స్ సూపర్‌వైజర్ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, అర్జున్, అప్పు, తొలుపునూరి కిరణ్ గౌడ్, బస్తీ నాయకులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, జూలై 13

ముజీబ్‌హుస్సేనీకి సన్మానం..

ముజీబ్‌హుస్సేనీని, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్. విక్రమ్‌కుమార్‌లను శనివారం టీఎన్జీవో ఈఎన్‌టీ దవాఖాన యూనిట్ అధ్యక్షుడు తూము కుంట రాజు, కార్యదర్శి ఎంసీ రాజేందర్, సంతోష్ తివారి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

– సుల్తాన్‌బజార్, జూలై 13

అవంతి కళాశాలకు న్యాక్ ఏ-గ్రేడ్ గుర్తింపు

కాచిగూడ,జూలై 13: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న అవంతి కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎస్ఏఏసీ)ఏ-గ్రేడ్ లభించిందని మాజీ మంత్రి, అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం బర్కత్‌పుర అవంతి కళాశాలలో కళాశాలల జనరల్ సెక్రటరీ డాక్టర్ ప్రియాంకతో కలిసి ఆయన మాట్లాడుతూ.. 1992 నుంచి కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు డేటా సైన్స్, డేటా ఎన్‌లోటిక్, సైన్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సులలో శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. గతంలో ఈ కళాశాలకు బి-ప్లస్ గ్రేడ్, అంతర్జాతీయ కళాశాలలో ఎంఓయూ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

మూసీ సుందరీకరణలో రెండు వేల గృహాలు కోల్పోయే ప్రమాదం

మూసీపరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, జూలై 13 : మూసీ సుందరీకరణలో రెండు వేల నిరుపేదల గృహాలు కోల్పోయే ప్రమాదముందని, వారికి తాను అండగా నిలబడి పోరాటం చేస్తానని నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శనివారం జుమ్మెరాత్‌బజార్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాలు చంద్రకిరణ్ బస్తీ, అంబేడ్కర్‌నగర్, ఉప్పలమ్మ బస్తీ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. నివాసాలను కోల్పోయే వారిని కలిసి సమస్య పరిష్కారానికి గాను పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంగళ్‌హాట్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, లోకేశ్, సతీశ్, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ముషీరాబాద్, జూలై 13: కంప్యూటర్, ఐటీ సాఫ్ట్‌వేర్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు కోర్సుల్లో నేషనల్ స్కిల్ అకాడమీ ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనుందని, ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పాస్ అయిన, ఎంసెట్ అర్హత సాధించి ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు సరికొత్త సాఫ్ట్‌వేర్ టెక్నాలజీతో నైపుణ్యాలను పెంచుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆర్టిఫిషిల్ ఇంటలిజెన్స్, సైబర్‌సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషీన్ లర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్ డేటా, డేటా సైన్స్, వెబ్ డిజైన్, జావా, ఒరాకిల్ తదితర 50కిపైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సులను ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. 2 నుంచి 6 నెలల వ్యవధిలో ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9505800050లో సంప్రదించాలి.

విద్యా, వైద్య రంగానికి 40 శాతం నిధులు కేటాయించాలి

అభివాదం చేస్తున్న పీఏసీ నాయకులు

రవీంద్రభారతి, జూలై 13 : పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యా, వైద్య రంగానికి 40 శాతం నిధులు కేటాయించాలని నూతన తెలంగాణ పీఏసీ కన్వీనర్ బి. సీతయ్య తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతయ్య మాట్లాడుతూ.. రైతు భరోసా చిన్న, సన్న కారు రైతులకు మాత్రమే వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భూస్వాములకు ఈ పథకం నుంచి మినహాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులను తొలగించి నిరుద్యోగ యువతను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీమ శ్రీనివాస్, డాక్టర్ నటానియెల్ పాల్గొన్నారు.

స్పాట్ లోన్ క్లౌడ్ టెక్నికో నిర్వాహకులను అరెస్టు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

చిక్కడపల్లి, జూలై 13: అమాయక ప్రజలను మోసం చేసి కోట్లాది రూపాయిలు దండుకున్న స్పాట్ లోన్, క్లౌడ్ టెక్నికో యజమానులను వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డిమండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాన్య బాధితుల సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్థ ఎండీలు కాకమాను క్రాంతికుమార్, సాయిప్రశాంత్, పావని, నరేశ్‌లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పదివేల రూపాయిల నుంచి లక్షలాది రూపాయిల కమిషన్ వస్తుందని మోసపూరిత మాటలు చెప్పి ప్రజలను దోచుకున్నారని అన్నారు. రూ.200 కోట్ల కుంభకోనం జరిగిందని దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. వెంటనే బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పూరపాటి నాగేశ్వరరావు, సాయినోజి మనోహర, మిర్యాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా.. కెమిస్ట్,డ్రగ్గిస్ట్ ఎగ్జిక్యూటివ్‌ల సమావేశం

ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ ఎగ్జక్యూటివ్ సమావేశం శనివారం నాంపల్లిలో జరిగింది. ఈ సమావేశంలో మెడికల్ షాప్‌ల సమస్యలపై చర్చించారు. అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గీసు లాల్ జైన్, కోశాధికారి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

– మెహిదీపట్నం

సత్తా చాటిన అంబేద్కర్ కళాశాల విద్యార్థులు

హైదరాబాద్ ఇంటర్‌గ్రూప్ కాంపిటేషన్‌లో భాగంగా తెంగాణ బెటాలియన్ క్యాడెట్స్ పోటీల్లో బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కళాశాలకు చెందిన 15 ఎన్‌సీసీ విద్యార్థులు సత్తాచాటారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కమాండింగ్ అధికారి లక్నల్ పసూన్నాద్, ఎన్‌సీసీ అధికారి ఎం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, జూలై 13

అల్పాహారం పంపిణీ

లయన్స్ క్లబ్ ఆఫ్ హెల్తీసిటీ లయన్ జీకే రమణ ఆధ్వర్యంలో మిల్స్ అండ్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం అశోక్‌నగర్‌లో అల్పాహారం పంపణీ చేశారు ఈ సందర్భంగా లయన్ జీకే రమణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివకు మార్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, సాంబశివరావు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, జూలై13

కిడ్నాప్ కేసు ఖాంతం..

వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ స్నేహమిశ్రా

చార్మినార్, జూలై 13 : ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి నగరానికి చేరుకున్న భాదితురాలి చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ మండల డీసీపీ స్నేహ యిశ్రా తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా బారషాహీద్ దర్గాకు చెందిన హబీబున్నీసాకు పటాన్‌చెరుకు చెందిన నస్రీన్‌బేగం, నూర్ జహాన్‌బేగం, మహమ్మద్ అదిల్ ఫోన్ ద్వారా పరిచయమయ్యారు. నగరానికి వస్తే ఉద్యోగం ఇప్పిస్తామని ఆశలు కల్పించారు. బాధితురాలు వారి మాటలు నమ్మడంతో ముగ్గురు నిందితులు నెల్లూరు చేరుకుని హబీబున్నీసాను తీసుకుని నగరానికి వచ్చారు. ఈ నెల 10వ తేదిన ఎంజీబీఎస్‌లో బస్సు దిగిన అనంతరం హబీబున్నీసాను ఉద్యోగానికి వెళ్లాలి.. సమీపంలోనే ఉన్న వాషరూంలో ఫ్రెష్‌అయి రావాలని సూచించారు. దీంతో హబీబున్నీసా తన 6 నెలల చిన్నారిని వారికి అప్పగించి వెళ్లింది. నిందితులు అక్కడి నుంచి జారుకున్నారు. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చిన హబీబున్నీసాకు నిందితులు కనిపించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలను చేపట్టారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు పటాన్‌చెరువు వైపు వెళ్తున్నట్లు గుర్తించి నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి చిన్నారిని రక్షించి, అదుపులోకి తీసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ స్నేహమిశ్రా తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

శ్రీలక్ష్మీవేంకటేశ్వరా ఎంటర్‌టైన్మెంట్ ఆధ్వర్యంలో శనివారం సిటీ సెంటర్‌లో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ రాగరేఖ, ప్రదీప్ చంద్ర ఆలపించిన మధుర గీతాలు అలరించాయి. అనంతరం గాయని రాగరేఖకు స్వర విరాజిత సమ్రాజ్జి బిరుదు, ప్రదీప్ చంద్రకు మధుర కంఠీరవ, పీఎల్‌ఎన్ ఆచార్యులు మధుర స్వర నందన బిరుదులతో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరా ఎంటర్‌టైన్మెంట్ సంస్థ అధ్యక్షుడు కొకారు రమణ సత్కరించారు.

– ముషీరాబాద్, జూలై 13

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం టోలిచౌకిలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులతో పలు సమస్యలపై చర్చించారు. కనీస సౌకర్యాలను మెరుగుపరచడానికి చర్యలు చేపడతామని అన్నారు.

– మెహిదీపట్నం, జూలై 13

మదిని దోచిన.. అనంతయ్య కళాఖండాలు

ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన కళాఖండం

తెలుగు యూనివర్సిటీ, జూలై 13 : ప్రముఖ చిత్రకారుడు డి. అనంతయ్య చిత్రించిన కళాఖండాలు వీక్షకుల మదినిదోచుకున్నాయి. ప్రకృతిలోని అందాలు, సోయగాలు, పచ్చని వాతావరణం, మైదానంలో ఉండే రాతి నమూనాలు, పశుపక్ష్యాదులు తదితర అంశాల సమాహారంగా అనంతయ్య మదిలోని ఆలోచనలను అద్భుతమైన చిత్రాలుగా చిత్రించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతయ్య వేసిన చిత్రాలతో కూడిన ఆర్ట్ ఎగ్జిబిషన్ కావూరిహిల్స్‌లోని చిత్రమయి ఆర్ట్ గ్యాలరీలో వీక్షకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఈ నెల 14వ రకు కొనసాగనున్న ఆర్ట్ ఎగ్జిబిషన్‌లోని కళాఖండాలకు అనంతయ్య జీవం పోసినట్లుగా చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి.

ఇద్దరి మధ్య ఘర్షణ.. కేసు నమోదు

కార్వాన్, జూలై13 : ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ రెండు గ్రూపుల తగాదాగా మారింది. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ సబ్జీమండీకి చెందిన టిప్పు, సోహయిల్ అనే ఇద్దరు యువకులు కలిసి శుక్రవారం రాత్రి చైతన్యపురిలోని పబ్‌లోకి వెళ్లి అనంతరం గొడవ పడ్డారు. సోహయిల్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేసిన టిప్పు ఇంటికి బయలుదేరాడు. అయితే సోహయిల్ సబ్జీమండీలోని తన సోదరులకు విషయం తెలుపడంతో ఆగ్రహానికి గురైన అర్షద్, అఫ్రోజ్‌లు పురానాపూల్ నుంచి వెళ్తున్న టిప్పును అడ్డగించి దాడి చేయడంతో టిప్పు గాయపడ్డాడు. ఇరు వర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపారు.